క్లుప్తంగా

పలువురికి మధుసూదనరెడ్డి నివాళి



భవనం అంజమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నలగొడ్డ డేవిడ్ తల్లి జొన్నలగడ్డ లుధియానా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అదే విధంగా భవనం సుబ్బారెడ్డి తల్లి భవనం అంజమ్మ మృతి చెందడంతో సమాచారం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

240 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో కిమ్స్ ఒంగోలు వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 240 మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు. కొంత మందిని మెరుగైన వైద్య నిమిత్తం వైద్యశాలకు సిఫార్సు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కట్టా సాయితేజ, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ విజయలక్ష్మీ, సర్పంచ్ రామిరెడ్డి శివనాగేంద్రం మరియు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ

చినగంజాం: కాపు బలిజ సంక్షేమ సేన మండల అధ్యక్షునిగా సోపిరాల గ్రామానికి చెందిన ఘంటా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కాపు బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం ప్రకారం లక్ష్మీనారాయణను ఎంపిక చేసి బాపట్ల జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ తెలిపారు.

కొప్పరపాడు విద్యార్థుల సత్తా



బత్తుల అభిరామ్



మేకల లహరేశ్వర్

బల్లికురవ: రాష్ట్రస్థాయిలో జరిగిన ఈఈ మెరిట్ ప్రతిభా పరీక్షలో మండలంలోని కొప్పరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. గత రెండేళ్లుగా జరిగిన వివిధ పోటీ పరీక్షలు, కౌశల్ క్విజ్, చెకుముకి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థి బత్తుల అభిరామ్ 68 మార్కులతో జిల్లా 2వ స్థానం, 7వ తరగతి విభాగంలో మేకల లహరేశ్వర్ 59 మార్కులతో జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మధ్యాహ్న భోజన పథకానికి వితరణ



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి దాతలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీపిక, శ్రీహర్ష దంపతులు మంగళవారం రూ. 10,000 అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు, రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగుర జయశీలరావు మాట్లాడారు. ప్రతి ఏడాది దాతల సాయంతో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, పుల్లగుర జయశీలరావు, అధ్యాపక సిబ్బంది శివపార్వతి, మంజుల, షీలా, కృష్ణవేణి, భరత్, వినీల, నీలిమ, జ్యోతి, జార్జ్, దుర్గాప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం రైతు దైన్యం

- దిగుబడులు రావు.. ధరలు ఇవ్వరు
- గత ఏడాది బస్తా రూ. 2000.. ఈ ఏడాది రూ.1500
- కొమ్మమూరు ఆయకట్టులో లక్ష ఎకరాల్లో వరిసాగు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతన్నలు



కారంచేడు-ఆదిపూడి రోడ్డులో నేలకొరిగిన 2270 రకం వరిచేలు



కారంచేడులో వ్యాపారుల వద్ద ఎగుమతులకు సిద్ధం చేస్తున్న ధాన్యం బస్తాలు



కారంచేడు-స్వర్ణ రోడ్డులో మిషన్ వేసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

కారంచేడు:

ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతుకు పెట్టుబడులు కూడా గగనంగా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దిగుబడులతో పాటు మంచి ధరలూ పలకడంతో లాభాలు ఆర్జించిన రైతులకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఓ పక్క ప్రభుత్వ గిట్టుబాటు ధర ఇవ్వక, మరో పక్క దళారుల దోపిడీ నడుమ కొమ్మమూరు ఆయకట్టు రైతులు నష్టాల మూటగట్టుకుంటున్నారు. దళారుల రంగ ప్రవేశంతో నిత్యం లారీలకు లారీలకు ధాన్యం తరలుతున్నా రైతులకు మాత్రం కష్టానికి తగిన ఫలం కూడా అందని పరిస్థితి.

ఆయకట్టులో లక్ష ఎకరాల్లో సాగు..

ఈ ప్రాంత వ్యవసాయానికి కొమ్మమూరు కాలువ ప్రధాన నీటి వనరుగా ఉంది. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాలతో పాటు ఇంకొల్లు, పర్చూరు మండలాల్లో కొంత భాగం పొలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఎక్కువగా 92 రకం , 2270 రకం పంటలను సాగు చేస్తారు.

పెట్టుబడులు బారెడు.. దిగుబడులు మూరెడు..

ఈ ఏడాది పెట్టుబడులు ఎకరానికి రూ.25వేల నుండి రూ 30వేల వరకు అయ్యాయి. దీనికి తోడు రూ 20వేల వరకు కౌలు ధరలు ఉన్నాయి. మొత్తంగా ఎకరానికి కనీసం రూ.50వేల వరకు ఖర్చుచేసారు. పంట దిగుబడులు బాగా వస్తాయని ఆశించిన అన్నదాతలకు వచ్చిన దిగుబడులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట కంకి దశలో (విత్తనం పాలు పోసుపోసుకునే దశలో) డిసెంబర్ నెలలో 20 రోజుల పాటు సన్నటి ముసురు వాతావరణం పట్టుకుంది. దీంతో వరి విత్తనాలు బిగిసుకోక, తాలు గింజలు ఏర్పడ్డాయని రైతులు చెబుతున్నారు. దీంతో ఎకరానికి 40 బస్తాలు వాస్తయని ఆశించిన అన్నదాతలకు కోత కోసి పంటలు నూర్చే సమయంకు ఎకరానికి కేవలం 22–28 బస్తాల వరకు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని అన్నదాతలు వాపోతున్నారు.

గిట్టుబాటు ధరలేవి..?

ఎకరానికి కనీసం 40 బస్తాల వరకు దిగుబడులు వస్తాయని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. సగటున వచ్చిన 25 బస్తాల దిగుబడులతో గత్యంతరం లేని అన్నదాతలు కనీసం ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలైన (75 కేజీల బస్తా) రూ 1740 వస్తుందని ఆశించారు. కానీ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంను అమ్మకాలు చేయాలంటే ఉన్న నిబంధనలతో అమ్మకాలు చేయలేని పరిస్థితి. దీంతో విధి లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారుల ఎలాంటి నిబంధనలు లేకుండా ఎగుమతులు, దిగుమతుల ఖర్చులు లేకుండా బస్తా (75 కేజీలు) రూ 1550కి కొనుగోలు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అన్నదాతల సంక్షేమం

గత ప్రభుత్వ పాలనలో గత ఏడాది ఇదే సమయంలో ధాన్యం బస్తా రూ.1800 నుంచి రూ.2000ల వరకు అమ్మకాలు చేశారు. దీంతో అన్నదాతలు పెట్టిన పెట్టుబడులతో పాటు ఎకరానికి రూ.10 వేల వరకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాది రూ.1500లకు దళారులు కొనుగోలు చేయడంతో బస్తాకు రూ.500 వరకు తక్కువ పొందుతున్నారు. దీంతో రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది.

దిగుబడులు అంతంతమాత్రమే



ఈ ఏడాది వరి సాగులో అన్నదాతలు నష్టపోయే అవకాశాలున్నాయి. గత ఏడాది డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా వరి కంకి దశలో పొట్ట దశలో గింజలు గట్టిపడలేదు. దీంతో తాలు ఎక్కువైంది. ఎకరానికి సగటున 25 బస్తాల దిగుబడే వచ్చింది. వచ్చిన కొద్దిపాటి దిగుబడులను అమ్ముకోవాలంటే సవాలక్ష ఆంక్షలు ఉన్నాయి. దీంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– ఎన్ రామాంజనేయులు, రైతు, స్వర్ణ

ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలి



ఎకరానికి కేవలం 18–25 వరకు మాత్రమే అవుతున్నాయి. ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వం ఆదిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రాఫ్ బుకింగ్‌ల ద్వార అయినా అయినా నష్టాన్ని నివారించాలని కోరుతున్నాము. ఇప్పటి వరకు గ్రామంలో ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ధాన్యంను ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

– ఎం శ్రీనివాసరావు, రైతు, కారంచేడు..

మేడికొండకు ఎన్‌సీసీ లెఫ్టినెంట్ హోదా



రాజేష్‌బాబుకు లెఫ్టినెంట్ హోదా బహూకరిస్తున్న గ్రూపు కమాండర్, ఇతర అధికారులు

చీరాల టౌన్: చీరాల కొత్తపేట ప్రసాద్‌నగరంకు చెందిన మేడికొండ రాజేష్‌బాబుకు ఎన్‌సీసీ లెఫ్టినెంట్ హోదా లభించింది. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్ నర్సరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం న్యూఢిల్లీలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌సీసీ రాజేష్‌బాబుకు ఎన్‌సీసీ లెఫ్టినెంట్ హోదా కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, ఎన్ఈసీ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు సమక్షంలో గ్రూపు కమాండర్ లెఫ్టినెంట్ ర్యాంక్ హోదాను బహూకరించారు.

గంగవరంలో నేత్రదానం



గుత్తికొండ అంజిరెడ్డి (ఫైల్

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని గంగవరంలో గుత్తికొండ అంజిరెడ్డి(82) మృతి చెందడంతో ఆయన నేత్రాలను స్వచ్ఛందంగా దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలు సేకరించారు. రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దాత కుటుంబసభ్యులు లక్ష్మమ్మ, రాఘవరెడ్డి, కోటేశ్వరమ్మ, రత్నకుమారిలను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో రథ సప్తమి



చీరాలలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న పాండురంగస్వామి



కారంచేడులో రథసప్తమి రోజున ప్రత్యేక పూజల్లో భక్తులు



అద్దంకి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి క్షేత్రంలో సూర్యనారాయణుడికి పూజ చేస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: రథసప్తమిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వీరరాఘవస్వామి దేవాలయం, పేరాల మదనగోపాలస్వామి దేవాలయం, సంతబజారులోని ఉడయవర్లు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉడయవర్లు దేవస్థానంలో ఏడు వాహనాలపై స్వామివార్లను ఉంచి ఊరేగించారు. తిరుమలలో జరిగే విధంగా చీరాలలోనూ ఏడు వాహనాలపై నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అలానే పాతచీరాలలోని సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కారంచేడు: రథసప్తమి పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. కారంచేడు పెద బజారు శివాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, వేణుగోపాలస్వామి, మండలంలోని స్వర్ణ శివాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, వల్లభరాయస్వామి దేవాలయంలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

అద్దంకి: ప్రముఖపుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రంలో సోమవారం రథసప్తమి పండుగను వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోధుమ రవ్వతో పొంగలి చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యద్దనపూడి: రథసప్తమిని పురస్కరించుకొని చింతపల్లిపాడు చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పెద్దయ్య, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష ఆదిత్య ఆరాధనా కార్యక్రమాలు, విష్ణు చాలీసా, ఆదిత్య హృదయ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహిచంచారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



చీరాలనగర్‌లో రీ సర్వే చేస్తున్న ఆర్డీఓ, ఇతర అధికారులు



ఆదిపూడిలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

- ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు

చీరాల టౌన్: భూ రీ సర్వేతో ప్రజలకు మేలు జరగడంతో పాటు భావితరాలకు భూ సమస్యలు ఉండవని, ప్రతి ఒక్కరూ విధిగా రీ సర్వే చేయించుకోవాలని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు అన్నారు. భూముల రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని చీరాల నగర్ గ్రామ పంచాయతీలో మంగళవారం భూములకు సర్వే చేశారు. ఆర్డీఓ టి.చంద్రశేఖరనాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది భూముల రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చీరాల మండలంలో 29,121 ఎకరాల భూములు రీ సర్వే చేయాల్సి ఉండగా 3975 ఎకరాల భూమి రీ సర్వే చేశామన్నారు. మిగిలిన భూములు మార్చి 31 లోగా రీసర్వే పూర్తి చేస్తామని సర్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రీ సర్వే వల్ల ప్రజలకు ఉన్న భూముల హద్దులు తెలుసుకోవడంతో భూములు అన్యాక్రాంతం కావన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులంతా విధిగా పాసుపుస్తకాలు, 1బీ అడంగల్, భూమి హక్కు పత్రాలతో వచ్చి రీ సర్వే చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రీ సర్వేకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీవీ ముసలయ్య, మండల సర్వేయర్ చెరుకూరి బ్రహ్మణయ్య, సచివాలయాల సర్వేయర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిపూడి (కారంచేడు): గ్రామాల్లో ఎప్పటి నుండో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.నాగరాజు అన్నారు. మండలంలోని ఆదిపూడిలో సర్వేయర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీ సర్వేను పరిశీలించారు. రైతులకు సంబంధించిన భూముల్లో సరిహద్దులు తేడాలు ఉండటం, రికార్డుల ప్రకారం ఎక్కువ, తక్కువ నమోదు కావడం, భూములు తగ్గడం వంటి అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. దీని కోసం రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్వేయర్ సత్యన్నారాయణ, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన వాడరేవు జెడ్పీ హైస్కూలు క్రీడాకారులు

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో చీరాల వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నెల 31 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు వరకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలో రాష్ట్రస్థాయిలో బాలమహోత్సవం-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 60కి పైగా పాఠశాలల నుండి 7,648 మంది విద్యార్థులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో చీరాల వాడరేవు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు బాలురు అండర్-17, అండర్-14, బాలికల విభాగంలో అండర్-14 విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను స్కూలు సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. గ్రామస్తులు కూడా క్రీడాకారులను ఎంతో గౌరవంగా సత్కరించి గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు, పీడీలు ఎన్. రవీంద్రబాబు, పి. రామ్‌నరేష్ యాదవ్, ఉపాధ్యాయులు డి. నారాయణరావు, బి. జయప్రద, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రికార్డుల పరిశీలన



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

మార్టూరు: ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం మార్టూరులో నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాల్లో గత నెల రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో భాగంగా రికార్డులను అధికారులు పరిశీలించారు. డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి, ఎంపీడీఓ వై శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి శోభన్, ఏపీడీ కోటా నాయక్, ఏపీఓ లక్ష్మీనారాయణ, సోషల్ ఆడిట్ టీం ఎస్ఆర్‌పీ చిరంజీవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టాలి



స్వర్ణలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



వేటపాలెంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ర్యాలీ

కారంచేడు: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని సమాజంలో నుంచి తరిమికొట్టేలా ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం శాలినీ సూచించారు. మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బ్యాంక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి అక్కడ ప్రజలతో మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం: ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయించవచ్చని వైద్యాధికారి వై.స్వాతి కిరణ్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్ఓ ఎన్.గురవయ్య, సూపర్‌వైజర్లు సుధాకర్, మార్తమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

అద్దంకి రూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బంగ్లారోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు పూనూరి నరేంద్ర మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు హైదరాబాద్ వచ్చి లక్షడప్పులు, వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి తేలశ్రీనివాసరావు, పూనూరి రమేష్, అంటోని, బల్లియ్య, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాత

అద్దంకి రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న స్థానిక కాకాని పాలెనికి చెందిన సందిరెడ్డి హనుమాయమ్మకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. రోటరీక్లబ్ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు పాత దామావారిపాలేనికి చెందిన షేక్ అబ్దుల్‌మాలిక్‌ను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు



పోలీసుల అదుపులో సారా తయారీదారులు

వేటపాలెం: సులభంగా డబ్బు సంపాదించేందుకు ముగ్గురు యువకులు సారా తయారీ చేయడాన్ని వేటపాలెం పోలీసులు గుర్తించారు. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది మంగళవారం వేటపాలెంలోని వివేకానందకాలనీకి వెళ్లారు. ఆ ప్రాంతంలో ఇద్దరు యువకులు ఐడీ సారా తయారీ చేస్తున్నారని గమనించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయతి్నంచగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మనుపాటి మాధవరావు సూచనల మేరకు బోగిరి భరత్, లాజరు అనే ముగ్గురు వ్యక్తులు ఐడీ సారా తయారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా పది లీటర్ల ఐడి సారా దొరికిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

సూపర్‌సిక్స్ తక్షణమే అమలు చేయాలి



సోమవరప్పాడులో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు కోరారు. మండలంలోని సోమవరప్పాడులో మంగళవారం రాత్రి కార్యకర్తలు, పార్టీ అభిమానులతో మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అర్హులందరికీ పక్కా ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే తల్లికి వందనం ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు.